www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 07 | జూన్ | 2026
పేజీలు : 8

## ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందాం

- త్వరలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- పట్టణ సమగ్ర శ్రేయస్సు కోసం కట్టుబడి ఉన్నా
- ఎంఎల్‌ఏ కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రణాళికా బద్దంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకోవాలని, ప్రతీ డివిజన్‌లోనూ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు సాగాలని శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యాతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ నగర పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. మిగతా 2లో..

# శాపమవుతున్న నిర్లక్ష్యం..!

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నిర్వాకం
- విశ్వసనీయత కోల్పోతున్న ధర్మాసుపత్రులు
- చర్యలపై తీవ్ర జాప్యం







**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొందరు వైద్యులు, సిబ్బంది నిర్వాకం రోగులకు శాపంగా మారుతుంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా రోగం తగ్గుతుందని ఆసుపత్రికి వస్తే ఉన్న రోగం పోక పోగా చివరకు అవయవాలే లేకుండాపోయే పరిస్థితి దాపురించింది. వెలుగు చూసిన ఒకట్రెండు ఘటనలే ఈవిధంగా ఉంటే వెలుగు చూడని ఘటనలు ఎన్నో ఉన్నాయి. వైద్యులు సరైన రీతిలో స్పందించక వైద్యం అందాక ప్రాణాలు కోల్పోయిన వారెందరో. ఖమ్మం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వెలుగు చూసిన రెండు ఘటనలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. దశాబ్ద కాలం క్రితం మిగతా 2లో..

## ప్రభుత్వ భూమి వదిలి పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం



- పోలీసులను మోహరించి రోడ్డు నిర్మాణ పనులు
- వినతులకు స్పందించని యంత్రాంగం
- మీడియా సమావేశంలో సిపిఐ నేత మహ్మద్ మౌలానా

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ భూమిని వదిలి పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఏడు తరాలుగా ఈ భూమి మా ఆధీనంలో ఉందని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంకు చెందిన మహ్మద్ మౌలానా తెలిపారు. అనేక సార్లు విజ్ఞప్తులు చేసినా, న్యాయస్థానాల తీర్పులను సైతం అధికార యంత్రాంగం పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహ్మద్ మౌలానా మాట్లాడుతూ ఏదులాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 64లో తమకు 6.36 ఎకరాలు, సర్వే నెం 66లో 3.03 ఎకరాల భూమి మిగతా 2లో..

### పెరిగిన ధరలను నిరసిస్తూ హామీ అమలుకై

## 10న కలెక్టరేట్ ముట్టడి



- సిపిఐ నేత బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ సహా ధరల పెరుగుదలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. సిపిఐ కార్యాలయంలో ఖమ్మం, వైరా, పాలేరు నియోజక వర్గాల సమావేశం శనివారం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగిన మిగతా 2లో..

# శాపమవుతున్న నిర్లక్ష్యం..!

**(మొదటిపేజీ తరువాయి)**
కుడి చేయి విరిగితే ఎడమ చేతికి కట్టు వేసిన ప్రబుద్ధులు ఉన్న ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న ఈ ఘటనలపై చర్యలు తీసుకోవడంలో జాప్యం నిర్లక్ష్యానికి ఊతమిస్తుంది. నిరంతర పర్యవేక్షణ కొరవడడం ఈ స్థితికి కారణమవుతుంది. ఏప్రిల్ మాసంలో ఏన్కూరుకు చెందిన ఓ మహిళ ప్రసవం కోసం ఖమ్మం ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రులలో ఇష్టానుసారంగా కోతలు కోస్తున్నారని సాధారణ ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి చేరితే ఇక్కడ కూడా వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. శస్త్ర చికిత్స చేస్తే చేశారు కానీ చేసే సమయంలో శిశువును బయటకు తీసే క్రమంలో వైద్యుల నిర్లక్ష్యంతో ఆపరేషన్ చేస్తున్న కత్తెర తాకి చిన్నారి తలపై బలమైన గాయమైంది అదేమిటి రక్తం తల నుంచి కారుతుందంటే మూడు కుట్లు వేస్తే సరిపోతుందన్నారు. చివరకు ఆ బిడ్డ మెదడు దెబ్బతిని దివ్యాంగుడిగా మారే పరిస్థితి ఏర్పడింది. వైరా మండలంకు చెందిన రేణుక కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఒకరికి అనారోగ్యంతో ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. వైద్యం అందించే క్రమంలో చిన్నారి చేతికి ఏర్పాటు చేసిన క్యానుల్లా సరి చేయకపోవడంతో అక్కడ సెప్టిక్ అయింది. చివరకు ఆ చిన్నారి చేతిని కోల్పోవాల్సి వచ్చింది. ఇద్దరు చిన్నారుల ఈ స్థితికి కారణమెవరు...? ఇంతటి నిర్లక్ష్యం పైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల మౌనం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుంది. ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, జీవనశైలి, ఇతరత్రా కారణాలతో ప్రతి ఒక్కరూ చిన్నదో పెద్దదో ఏదో ఒక వ్యాధితో బాధపడే పరిస్థితి. ప్రైవేటు ఆసుపత్రులు మామూలు జ్వరం వచ్చిందని వెళితేనే రక రకాల పరీక్షలు రాసి వేలు, లక్షలు గుంజుతున్న ఈ రోజుల్లో ఆర్థిక స్థోమత లేని అనేక మంది ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫీజులను చెల్లించలేక జబ్బులను తగ్గించుకునేందుకు ప్రాణాలను కాపాడుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే పరిస్థితి ఈవిధంగా ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం నిర్వహిస్తూ కాసులకు కక్కుర్తి పడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

**ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిపై కొరవడిన పర్యవేక్షణ :**
ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిపై పర్యవేక్షణ కొరవడింది. ముగ్గురు మంత్రులు కలిగిన ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తీరు నిత్యం వివాదస్పదమవుతుంది. సరైన రీతిలో పర్యవేక్షణ లేకపోవడం, ప్రజాప్రతినిధులు స్పందించక పోవడం, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం ఈ దుస్థితికి కారణమవుతుంది. వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఒక వంతు అయితే ఈ ఆసుపత్రి అక్రమాలకు అడ్డాగా మారింది. నకిలీ వికలాంగ ధృవీకరణ పత్రాలు ఇవ్వడంలో రాష్ట్రంలోనే ప్రథమ శ్రేణిలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా వేల మందికి నకిలీ ధృవీకరణ పత్రాలు ఇచ్చి ప్రభుత్వ ప్రజా ధనాన్ని అక్రమంగా పొందెందుకు ఈ ఆసుపత్రుల్లో కొందరు కారణమవుతున్నారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో జరిగిన అనేక ఘటనలకు సంబంధించి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**విచారణతోనే సరి :**
ప్రభుత్వ ఆసుపత్రిలో ఏది జరిగిన విచారణతోనే సరిపెడుతున్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే వైద్యులకు రాజకీయ పరిచయాలే ఈ పరిస్థితికి కారణమవుతుంది. తప్పిదాలు జరగగానే రాజకీయ నాయకులను, ప్రజాప్రతినిధులను ఆశ్రయించడం జరుగుతుండడంతో విచారణతోనే ముగుస్తుంది. కేవలం విచారణకు ఆదేశించడం చేతులు దులుపుకోవడం ఖమ్మంజిల్లా ఉన్నతాధికారులకు అలవాటుగా మారింది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్యుల పైన నకిలీ ధృవీకరణ ప్రతాలతో ప్రజా ధనం దుర్వినియోగానికి కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ఎందు జంకుతున్నారో అర్థం కాని స్థితి. నకిలీ ధృవీకరణ పత్రాలకు సంబంధించి ఆధారాలతో సహా మీడియాలో వార్తలు వచ్చినా కనీసం స్పందించే స్థితిలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు లేరంటే పలు అనుమానాలకు తావిస్తుంది. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి తీరుపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలి. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఖమ్మం ఆసుపత్రి తిరిగి రోగుల విశ్వసనీయతను పొందగలుగుతుంది.

## పెరిగిన ధరలను నిరసిస్తూ హామీ అమలుకై 10న కలెక్టరేట్ ముట్టడి

**(మొదటిపేజీ తరువాయి)** సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ సంపన్నులు, కార్పొరేట్ల సేవలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలను పట్టించుకునే స్థితిలో లేదన్నారు. పదేళ్ల నాడు మోడీ అధికారాన్ని చేపట్టే ముందు రూ. 72 ఉన్న పెట్రోల్ ఇప్పుడు రూ. 115కు చేరుకుందని డీజిల్ సైతం రూ.55 నుంచి రూ. 108లకు చేరుకుందని ఆయన తెలిపారు. గ్యాస్ ధర రెండు రేట్లు పెరిగిందని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రాబడి పెరగలేదని హేమంతరావు తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా సామాన్యులను విస్మరించి పాలన సాగిస్తుందని యావత్ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2023 ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలను ఇచ్చిందని ఆ హామీలు నెరవేర్చడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. రెండున్నర ఏళ్లలో హామీల అమలులో వైఫల్యం చెందిన ప్రభుత్వం ఇకనైనా హామీల అమలుపై దృష్టిసారించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 నెల వారి జమ, కళ్యాణ లక్ష్మి క్రింద తులం బంగారం, కొత్త పింఛన్లు, పింఛన్ల పెంపు వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 24 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేశారని జూన్ రెండు నాటికి రెండు లక్షల పింఛన్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం అది కూడా అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అరకొరగా ఇస్తున్న ప్రభుత్వం నివాస స్థలాల పంపిణీ గురించి మరిచిపోయిందన్నారు. స్థలాలు ఇస్తాం, ఇండ్లు ఇస్తామని చెప్పిన హామీని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తుందని అందుకే సిపిఐ ఆందోళన బాట పట్టిందన్నారు. రైతు భరోసా కూడా సరిగ్గా అమలు జరగడం లేదని రెండు ఎకరాల రైతులకు మాత్రమే రైతు భరోసా జమ చేశారని మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని హేమంతరావు ప్రశ్నించారు. మళ్లీ వానాకాలం సమీపిస్తుందని రైతు బంధు ఎప్పుడు జమ చేస్తారని ఆయన ప్రశ్నించారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేసినా రైతులకు నెలలు గడిచినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరే భూములను వేలం వేయడం ద్వారా మాత్రమే ఆదాయం సమకూర్చుకోవాలని ప్రయత్నిస్తుందని హేమంతరావు ఆరోపించారు. ధరణిలోని లోపాలను భూభారతి సరి చేయలేదని భూ భారతి పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కుఅన్న చందంగా ఉందన్నారు. పింఛన్లను నాలుగు వేలకు పెంచాలని, అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని, హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

## గ్రామ సభ హామీ మేరకు పరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** డోర్నకల్, భద్రాచలం రైల్వే రెండో లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి గ్రామసభలో ప్రకటించిన విధంగా మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితులు సాదిక్ అలీ, రాహద్ బేగం దంపతులు డిమాండ్ చేశారు. కారేపల్లి గ్రామకంఠంలో 16 మంది ఇంటి స్థల యజమానులు నిర్వాసితులవుతున్నారని తెలిపారు. గ్రామసభలో మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినా, ప్రస్తుతం ఇంటి స్థలాలను వ్యవసాయ భూములుగా పరిగణించి తక్కువ పరిహారం చెల్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామసభ హామీని అమలు చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## అధికారిక కార్యక్రమాలను వేదికలుగా మార్చొద్దు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్న కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల స్థానంలో పార్టీ నాయకులకు వేదికపై స్థానం కల్పించడం ప్రోటోకాల్ ఉల్లంఘన అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా నిర్వహించడం సరికాదని, గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అదే విధానం కొనసాగుతోందన్నారు. దీనిపై సాక్ష్యాధారాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తూ, అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, బీఆర్‌ఎస్ నాయకుడు సూదిరెడ్డి గోపిరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్న అశోక్ కుమార్, మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు చుంచు రామ్మూర్తి, కళ్యాణపురం సర్పంచ్ లకావత్ రామారావు, గుంపెన శ్రీను, శివారపు డాక్టర్ బాబు, కాట్రాజ్ కొండల్, తాటి వెంకటేశ్వర్లు, తోకల వెంకటేశ్వర్లు, మేకల భాస్కర్, కాలవ సంసోన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందాం

**(మొదటిపేజీ తరువాయి)** ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషి చేయాలన్నారు. నీటి పథకానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని, పనులు పూర్తయితే కార్పొరేషన్‌లో వ్యాప్తంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో సిబ్బంది కొరత వేదిస్తోందని, త్వరలో ఉన్నతాధికారులతో మాట్లాడి అదనపు సిబ్బందిని పెంచేలా చూస్తామని చెప్పారు. విద్యుత్ పారిశుధ్యం, అంతర్గతరోడ్లు, మురుగు కాలువలు, డ్రైన్లు తదితర దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తాము ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించామని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు లేని ప్రత్యేక కార్పొరేషన్‌గా కొత్తగూడెం కార్పొరేషన్‌ను తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ప్రభుత్వ భూమి వదిలి పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం

**(మొదటిపేజీ తరువాయి)**



ఉందని ఈ భూమిని ఇప్పటికి మేము ఏడు తరాలుగా అనుభవిస్తున్నామని ఆయన తెలిపారు. గతంలో రాజకీయ కక్షల నేపథ్యంలో తాను జైలులో ఉన్నప్పుడు ప్రభుత్వ డొంకను వదిలి తన భూమిలో రోడ్డు నిర్మాణం చేశారని అప్పుడు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న రోడ్డు ఆ తర్వాత ఆర్అండ్‌బి పరిధిలోకి వచ్చిందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అందరికీ వినతి పత్రాలు సమర్పిస్తూ న్యాయస్థానాలను సైతం ఆశ్రయించామన్నారు. ఇటీవల ఆర్‌డివో సమక్షంలో ఇంజనీరింగ్ అధికారులు తనను పిలిపించి భూ వివరాలు అడిగారని తనకు కలిగిన పట్టా భూమిని వదిలి రోడ్డు నిర్మాణం చేసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా గతంలో ఉన్న డొంకను పక్కనే ఉన్న ఎన్నెస్పి మేజర్ కాలువను సర్వే చేయకుండా శుక్రవారం అర్థరాత్రి 50 నుంచి 60 మంది పోలీసులు 40 వాహనాల్లో వచ్చి బలవంతంగా నా భూమిలో రోడ్డు పోసేందుకు ప్రయత్నించారన్నారు. అడ్డుకుంటే బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. కాంట్రాక్టర్ మనుషులు, పోలీసులు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై తన పట్టా భూమిలో రోడ్డు నిర్మిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తాను అభివృద్ధికి వ్యతిరేకం కాదని ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం చేసుకుంటే తనకు అభ్యంతరం లేదని అవసరమై తన పట్టా భూమిని తీసుకున్నా సర్వే చేసి ఎంత భూమి పోతుందో దానికి పరిహారం చెల్లించాలని మౌలానా డిమాండ్ చేశారు. రోడ్డు పక్కనే ప్రభుత్వ భూమి ఎన్నెస్పి స్థలం కలిపి 70 అడుగుల వెడల్పున ఉందని రోడ్డు నిర్మాణానికి ఎటువంటి ఆటంకం లేదని కానీ కక్షపూరితంగా తన భూమిలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారన్నారు. న్యాయస్థానం తీర్పులను, రెవెన్యూ నిబంధనలను, భూసేకరణ చట్టాని అపహాస్యం చేస్తూ దౌర్జన్యంగా పోలీసులతో బెదిరించి భయపెట్టడం ద్వారా తన భూమిలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తన పట్టా భూమిలో నుంచి రోడ్డు నిర్మాణం జరగనివ్వబోమని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. న్యాయ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, ఏఐవైఎఫ్ నాయకులు మహ్మద్ గౌస్‌పాషా, స్థానికులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రుపాలెంలో పశువుల దొంగలు అరెస్టు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పశువులను దొంగిలించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ముఠాను ఎర్రుపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధిర సిఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.... కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు ప్రాంతానికి చెందిన కంభం సాయి, పెనుగొండ సాయి, ఓర్సు గోపాల కృష్ణ, ముద్రకోల గోపిచంద్ లు గంపలగూడెం, బోనకల్, చింతకాని మండలాల్లో వరుస పశువుల దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వీరితో పాటు రెండు అశోక్ లే లాండ్ వాహనాలను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలి : తెలుగుదేశం



**ప్రజాపక్షం/వైరాః** వైరాలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు రైతు సమస్యలపై అమరనేని గోపాలరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కిలారి సురేందర్ చెరుకూరి చలపతి మాట్లాడుతూ వ్యవసాయ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది పడకుండా విత్తనాలు మందులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని, రైతులు అమ్మిన ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని వారు అన్నారు. సబ్సిడీ ప్రకటించిన వ్యవసాయ యంత్ర పరికరాలు రైతులకు అందిచంఆలని, నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలని, నకిలీ విత్తనాలు పూర్తిగా అరికట్టాలని రైతులకు ఎలాంటి సమస్య ఎదురుగా కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మందడపు మధుసూదన్ రావు, బోడేపూడి మురళి, మద్దిన్ని రామారావు, మోత్కూరు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలి

## ఎమ్మెల్యే రాందాస్‌నాయక్





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఎన్ఆర్ఐ కొండబోలు సురేస్‌చౌదరి కొండ బోలు లలిత సహకారంతో వైరా మండలంలోని ప్రభుత్వ హైస్కూల్స్ కళాశాలలో పదో తరగతి, ఇంటర్ ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.7500లు చొప్పున నగదు ప్రోత్సహకాలను శాసనసభ్యులు మాలోతు రాదాస్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా శాషనసభ్యులు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ కొండబోలు సురేష్ లలిత విద్యార్థులు నగదు పురస్కారాలు ధాతృత్వాన్ని ప్రశంసించారు. బీద విద్యార్థులకు కొండబోలు సురేష్ నగదు బహుమతులు అందజేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యను ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో రూ.200కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టి కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని అన్నారు. ప్రత్యేకంగా గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమలో ప్రథమ బహుమతులు రరూ.2.10లక్షలు, ద్వితీయ బహుమతులు రూ.1,27,500లు చొప్పున నగదు బహుమతులు ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కాపా మురళి, కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి, బెజవాడ వీరభద్రం, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, వైరా మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు శీలం నర్సిరెడ్డి, పొదిల హరినాధ్, మచ్చా వెంకటేశ్వరరావు, గూడపాటి సూర్యప్రకాశరావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలను తగలబెట్టవద్దు

## -గ్రామసభలో వ్యవసాయ అధికారులు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వరి కొయ్యలు, పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియ దున్నాలని ఖమ్మం డివిజన్ ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ సరిత, ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు లు తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన నివేదిక కార్యక్రమంలో భాగంగా రాంక్యాతండాలో నిర్వహించిన గ్రామసభలో ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ సరిత, ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నినట్లయితే సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. పంట వ్యర్థాలను తగలబెడితే భూసారం దెబ్బతినడంతో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా పత్తి విత్తనాలను నాట వద్దని సూచించారు. ఆరుతడి పంటలైన అపరాల సాగు చేసినట్లయితే భూసారం పెరగడంతో పాటు తక్కువ ఖర్చుతో నికర ఆదాయం లభిస్తుందన్నారు. రైతులు పురుగు మందులను తక్కువగా వాడి ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని తద్వారా పెట్టుబడులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. నీటి వసతులు ఉన్న రైతులు తప్పనిసరిగా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు రాయితీ కల్పిస్తుందని అంతర పంటలను కూడా సాగు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ రామ్మూర్తి, ఆర్ఐ వహీద్, ఏఈవో, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పార్క్ భూముల విక్రయంపై అనుమానాలు..?



**-84 ఎకరాలు రూ.20 లక్షలకే విక్రయం..?**
**-క్యాబినెట్ ఆమోదం ఎక్కడ..?**
**-ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీకి అమ్మాల్సిన అవసరం ఏమిటి..?**
**-సమగ్ర విచారణకు రైతు, ప్రజా సంఘాల డిమాండ్**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బుగ్గపాడు ఫుడ్ పార్క్‌కు చెందిన సుమారు 84 ఎకరాల భూమిని ప్రైవేట్ కంపెనీకి ఎకరానికి రూ.20 లక్షల చొప్పున విక్రయంపై రైతులు,రైతు సంఘాల నాయకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భూముల అమ్మకంపై అయా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరం భూమి విలువ రూ.40 నుండి 50 లక్షల వరకు పలుకుతున్న నేపథ్యంలో తక్కువ ధరకే ప్రభుత్వ భూములను విక్రయించడం వెనుక ఉన్న కారణాలపై స్థానిక ప్రజలు, రైతు సంఘాలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఫుడ్ పార్క్ అధికారులు భూములు విక్రయించినట్లు అంగీకరించడమే కాకుండా, ఆ భూముల్లో సంబంధిత కంపెనీ తమ అవసరాలకు అనుగుణంగా కార్యకలాపాలు చేపట్టవచ్చని ప్రకటించడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూముల విక్రయానికి సాధారణంగా రాష్ట్ర మంత్రివర్గం (క్యాబినెట్) ఆమోదం తప్పనిసరి అయినప్పుడు, ఈ వ్యవహారంలో ఎలాంటి అనుమతులు తీసుకున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.ఫుడ్ పార్క్ పేరుతో గతంలో రైతుల నుంచి భూములను సేకరించిన ప్రభుత్వం, ఇప్పుడు అదే భూములను ప్రైవేట్ కంపెనీకి శాశ్వతంగా విక్రయించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పరిశ్రమల స్థాపన కోసం భూములను లీజు ప్రాతిపదికన కేటాయించడం సాధారణ విధానం కాగా, నేరుగా విక్రయించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. భూ సేకరణ సమయంలో రైతులకు, స్థానిక ప్రజలకు చూపిన లక్ష్యాలు, హామీలు ఏమయ్యాయనే అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రజా ప్రయోజనాల పేరుతో సేకరించిన భూములను ప్రైవేట్ సంస్థలకు విక్రయించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశాలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్తిగా ఉన్న ఫుడ్ పార్క్ భూములు ఏ విధానంలో, ఎవరి ఆమోదంతో, ఏ నిబంధనల మేరకు విక్రయించబడ్డాయో అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ విలువకు చాలా తక్కువ ధరకు భూములు విక్రయించారనే ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్టేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, విక్రయ ప్రక్రియలో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత రాష్ట్ర మంత్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. తొలుత ఈవిఎం గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమ క్షంలో సీల్‌ను తీసి లోపలికి వెళ్లి ఈవిఎం, వివి ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేసి మాట్లాడుతూ ఈవిఎంల భద్రత ముఖ్యమైందని, సిసి కెమెరాల పనితీరును ఎప్ప టికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీల ప్రతినిధుల, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలను అరికట్టాలి

## -ఏఐయుకెఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలని కోరుతూ ఏఐయుకెఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. శనివారం ఏఐయుకెఎస్ బృందం తహసీల్దార్ శ్వేతను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను ఉచితంగా అందించాలని కోరారు. రైతులు నకిలీ విత్తనాలు, పురుగు మందుల వల్ల నష్టపోకుండా వాటిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకెఎస్ జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మ ణ్, నాయకులు బాలిన నర్సింహారావు, వీరబాబు, బాబు, రామనాథం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 15 నుంచి ఆర్యవైశ్య మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** నిరుపేద ఆర్యవైశ్య సోదరీమణులకు ఈ నెల15 నుండి కుట్టుమిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్‌కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేద సోదరీమణులకు నిబంధనల మేరకు కుట్టుమిషన్ అందజేస్తామని, కుట్టుమిషన్లు, కావాల్సిన వారు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతని మొట్టమొదటి చైర్‌పర్సన్‌గా నియమించడం జరిగిందని, ఇప్పటికే నిరుపేద ఆర్యవైశ్య సోదరసోదరీమణులకు వివిధ రకాలుగా సేవా కార్యక్రమాలు అందించడం జరిగిందని, విద్యార్థులకు ప్రైవేటు కాలేజీల్లో 50% రాయితీపై సీట్లు కల్పించడంతో పాటు వివిధ విషయాల్లో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ సేవలందిస్తుందని, ఆసక్తి ఉన్నవారు నియోజకవర్గ ఇంచార్జిని సంప్రదించాలని, వివరాలను తాటికొండ రాము 9848414578, పెనుగొండ ఉపేంద్రరావు 9849743189కు పంపాలని ఆయన తెలిపారు.

# 114 పూర్వ ప్రాథమిక పాఠశాలలకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖమ్మం జిల్లాలో 202627 విద్యా సంవత్సరానికి మంజూరైన 114 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఒక ఆయా చొప్పున నియమించనున్నారు. ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10+2) లేదా సమాన అర్హత కలిగి ఉండాలి. ప్రారంభ బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ నిర్దేశించిన శిక్షణను తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా పోస్టుకు కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఇన్స్ట్రక్టర్లకు నెలకు రూ.8,000/ ఆయాలకు రూ. 6,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో అదే నివాస ప్రాంతం (హ్యాబిటేషన్), గ్రామ పంచాయతీ, మండలానికి చెందిన వారికి వరుసగా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. నోటిఫికేషన్ విడుదల తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, మాజీ సైనికులకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుంది. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాల ప్రతులను జతచేసి సంబంధిత మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. దరఖాస్తుల స్వీకరణ జూన్ 8 నుంచి ప్రారంభమై జూన్ 9 వరకు కొనసాగుతుంది. జూన్ 10న మండల ఎంపిక కమిటీ, జూన్ 11న ఆర్డీవో/సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలోని ఎంపిక కమిటీ దరఖాస్తులను పరిశీలించనుంది. అదే రోజు ఎంపిక జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష ఖమ్మంకు సమర్పించనున్నారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే నిర్వహించబడతాయని జిల్లా విద్యాశాఖాధికారి స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

### ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్



ప్రజాపక్షం/కారేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గోగ్గేలా నాగరాజు కుటుంబానికి వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ అండగా నిలిచారు. ఆయన ఆదేశాల మేరకు ఉసిరికాయలపల్లి సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి, రాజు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి దశదిన కార్యక్రమం సందర్భంగా 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ రాందాస్ నాయక్ తరపున స్థానిక నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కోమట్లగూడెం సర్పంచ్ కె జయసుధ, గుగులోత్ రాజు, బోడ సెత్రం, గుంపిడి నాగేశ్వరరావు, రెడ్డబోయిన జగ్గయ్య, భూక్యా మాన్సింగ్, కాటయ్య పాల్గొన్నారు.

## కాకర్లలో మాస్టర్ ఈకే హోమియో వైద్య శిబిరం



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండల పరిధిలోని కాకర్ల గ్రామంలో మాస్టర్ ఈకే శతాబ్ది సందర్భంగా మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య సేవ శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సుమారు 130 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మందులను రోగులకు వ్యాధి నియంత్రణలోకి వచ్చేవరకు ఉచితంగా పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హోమియో డాక్టర్స్ జి రాధాకృష్ణమూర్తి, టీ రవికాంత్ లు మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో, మారిన ఆహారపు అలవాట్లు అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణం అన్నారు. దానితోపాటు ఆరోగ్య సమస్యల నివారణకు మనం వాడుతున్న ఇంగ్లీష్ మందుల వలన ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి మన ఆహారపు అలవాట్లు మార్చుకోవడంతోపాటు ఇంగ్లీష్ మందుల వాడకాన్ని తగ్గించి హోమియో మందులు వాడడం వలన ఆరోగ్యంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు దరిచేరే అవకాశం ఉండదని తెలిపారు. కావున ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారైనా నిర్భయంగా హోమియో మందులను వాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదరేంద్రబాబు, కే శ్రీనివాస రెడ్డి, పిఎస్ఎస్ మూర్తి, పి శ్రీధరరావు, టీ ధనలక్ష్మి, కోటేశ్వరరావు, కరుణ, వీరమల్లు, సిహెచ్ శ్రీమన్నారాయణ, గ్రామస్తులు రాచబంటి వెంకటనరసయ్య, కళ్యాణం వెంకటప్పయ్య, గోగుల వెంకటేశ్వర్లు, సున్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 8న రాకేష్‌రెడ్డి ఈ క్లాసెస్ యాప్ ప్రారంభం

### -నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి:మాజీ ఎంఎల్ఏ మెచ్చా



ప్రజాపక్షం/దమ్మపేట: నిరుద్యోగ యువతకు ఉచితంగా నాణ్యమైన పోటీ పరీక్షల శిక్షణ అందించేందుకు ఎంఎల్‌సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చక్రవర్తి ఈ క్లాస్ రూమ్ భాగస్వామ్యంతో రూపొందించిన రాకేష్‌రెడ్డి ఈక్లాసెస్ యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 8న ఉదయం 10గంటలకు కొత్తగూడెం క్లబ్, రైటర్ బస్తీలో నిర్వహించనున్నట్లు అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉచిత కోర్సులు, స్టడీ మెటీరియల్, నిపుణుల మార్గదర్శకత్వం అందించే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యుత్ సౌకర్యాల విస్తరణ పనులు

### -గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎంఎల్ఏ జారె





ప్రజాపక్షం/దమ్మపేట: అశ్వారావుపేట ఎంఎల్ఏ జారె ఆదినారాయణ శనివారం దమ్మపేట మండలంలోని పాతలచ్చాపురం గ్రామంలో పర్యటించి విద్యుత్ సౌకర్యాల విస్తరణ పనులను పరిశీలించారు. గ్రామంలోని అంతర్గత వీధుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఎంఎల్ఏ, నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ లైన్ విస్తరణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడిన ఎంఎల్ఏ జారె ఆదినారాయణ, వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎంఎల్ఏకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలే తమకు ముఖ్యమని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి కొనసాగిస్తామని ఎంఎల్ఏ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతు పట్టా భూమిలో రోడ్డు ఏర్పాటు

**- అధికారులు రైతుల నడుమ తీవ్ర ఉద్రిక్తత**
**- నష్టపరిహారం అందించాకే పనులు చేపట్టాలి : మౌలానా**






ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 24వ వార్డు సమీపంలోని ఖమ్మంమహబాద్ రహదారిపై రైతు పట్టా భూమిలో నుంచి రోడ్డు ఏర్పాటు చేస్తున్న విషయంలో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఖమ్మంమహబాద్ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రైతు మొహ్మద్ మౌలానాకు చెందిన భూమిలో రోడ్డు నిర్మాణం చేపట్టడాన్ని కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం నాయుడుపేట సర్కిల్ నుంచి ఖమ్మంమహబాద్ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఏదులాపురం రెవెన్యూ పరిధిలోని 64వ సర్వే నెంబర్‌లో ఉన్న పట్టా భూమి గుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. శనివారం అర్ధరాత్రి నుంచి యంత్రాలతో పనులు ప్రారంభించగా, విషయం తెలుసుకున్న రైతు కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ మరుసటిరోజు కూడా భారీ పోలీసు బందోబస్తుతో రెవెన్యూ అధికారులు పనులను కొనసాగించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా రైతు మొహ్మద్ మౌలానా మాట్లాడుతూ...తమ కుటుంబానికి ఏడు తరాలుగా 64వ సర్వే నెంబర్‌లో వారసత్వంగా ఉన్న పట్టా భూమిని ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారీ సంఖ్యలో పోలీసులు, అధికారులు మోహరించి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిలో నుంచే రోడ్డు నిర్మాణానికి అవకాశం ఉన్నప్పటికీ కావాలనే తమ విలువైన వ్యవసాయ భూమిలో నుంచి రోడ్డు వేస్తున్నారని ఆయన ఆరోపించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే చట్టబద్ధంగా తమకు చెందిన పట్టా భూమిని కోల్పోవాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. తమ భూమిని స్వాధీనం చేసుకోవాల్సి వస్తే ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. ఈ వివాదం నేపథ్యంలో సిపిఐ శ్రేణులు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకుని రైతు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానాకు అండగా నిలిచారు. అలాగే రైతులు కలెక్టర్‌ను కలిసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి

**-మాదారాన్ని దత్తత గ్రామంగా తీసుకుని అభివృద్ధి చేయాలి**
**-గ్రామసభలో ప్రజాసమస్యలపై వేడెక్కిన చర్చ**



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం మాదారం గ్రామ పంచాయితీలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ ప్రజా సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక అంశాలతో రసవత్తరంగా సాగింది. గ్రామ అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ వూకంటి రవికుమార్ మాట్లాడుతూ రెండో విడతలో మాదారం గ్రామ పంచాయితీకి అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా జరగాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం చోటుచేసుకుంటే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అర్హులైన పేద కుటుంబాలకే ఇళ్లు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. మాదారం గ్రామ పంచాయితీని ఎంఎల్ఏ జారె ఆదినారాయణ దత్తత గ్రామంగా తీసుకుని ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని అన్ని వాడల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం. పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈకార్యక్రమంలో శనగాని వినోద్, పసుల సూర్య, వూకంటి కిషోర్, ముదిగొండ వెంకన్న, కురం ప్రభాకర్, గణప భాస్కర్, గంగాధర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు**



ప్రజాపక్షం/అశ్వాపురం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలో ఆయన పలు సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందజేశారు. ముందుగా ఆనందపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహాలలో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చింతలపూడి సుకన్య, గన్నారపు రాజేశ్వరి, సోడే సుభద్ర, పోడియం కుమారి, నాగుల నాగలక్ష్మి, మన్నెం సత్యవాణి తదితర లబ్ధిదారుల నూతన గృహాలను సందర్శించి కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాల చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం అశ్వాపురం రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన రూ 38,42,408 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎంపీడీవో ముత్యాలరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, యూత్ అధ్యక్షులు గొల్లపల్లి నరేష్, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధికి సిపిఐ కార్పొరేటర్లు దోహదపడాలి

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తండి**
**- 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేద్దాం**
**- ఎంఎల్ఏ కూనంనేని**





ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సిపిఐ పక్ష కార్పొరేటర్ల సమావేశానికి ఆయన ముఖ్యాతిధిగా హాజరై మాట్లాడారు. సిపిఐ పక్ష కార్పొరేటర్లు తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పౌర సేవలు అందించాలన్నారు. రాబోయే కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సి విధానాలపై దిశా నిర్దేశం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు ముందుండాలన్నారు. పట్టణంలోని ప్రతీవార్డు పరిధిలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు , వీధి దిపాలు, వంటి సమస్యలను గుర్తించి వాటి తక్షణ పరిష్కారానికి మున్సిపల్ అధికారులతో కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల సామాన్యులపై భారం పడుతోందని, నిత్యావసర వస్తువుల అధిక ధరలకు నిరసనగా ఈనెల 10న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి కార్పొరేటర్లు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన వివరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిలాల్ కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య**



ప్రజాపక్షం/ఏన్కూరు: రైతులకు నకిలీ విత్తనాలమ్మితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని తూతక్క లింగన్నపేట శనివారం గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పలు విత్తన దుకాణాల షాపులను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దుకాణాలు వద్ద పత్తి, మిర్చి విత్తనాలు తీసుకున్న తర్వాత బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని అన్నారు. రైతులు పంట అవశేషాలు కాల్చే వారిపై జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. అట్టి వారిపై రూ 5వేల నుంచి రూ 25వేల వరకు జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలయ దున్నలన్నారు. ఎల్‌నీవో ప్రభావం కారణంగా వర్షాలు తక్కువ పడే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. కంది, పెసర, మినుములు, జొన్నలు వంటి పప్పు దినుసు పంటలు వేసుకోవాలని సూచించారు. రైతులు తొందరపడి పత్తి విత్తనాలు వేయవద్దని, నైరుతి రుతుపవనాలు వచ్చిన తర్వాత భూమి అదును చూసి మాత్రమే విత్తనాలు వేసుకోవాలని తెలిపారు. యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకుని పొందాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్, మండల ప్రత్యేక అధికారి రాజేందర్, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, ఏఈఓ అశోక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వం

**స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి**
**ఏఐయుకెఎస్ రాష్ట్ర నాయకులు బానోతు ధర్మ**




ప్రజాపక్షం/జూలూరుపాడు: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా అనుబంధ (ఏఐయుకెఎస్) అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జూలూరుపాడు మండల తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పార్టీ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ. అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు బానోతు ధర్మహాజరై మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఆర్థిక వ్యవహారాల మంత్రి వర్గ ఉప సంఘం (సిసిఈపి) 14 రకాల ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు (యంఎసిపి) 202627 సం॥నకు పెంచడానికి నిర్ణయం తీసుకుంది. 12 సంవత్సరాల క్రితం అధికారంలోకి రాకపూర్వం స్వామినాథన్ కమిటీ సిఫారసులను అనుసరించి సమగ్ర వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుల ప్రాతిపదికన కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తామని కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. కానీ ఏనాడు ఆ ఊసుకే పోలేదు. దేశ రైతాంగం యావత్తు రోడ్డుపైకెక్కి ఆందోళనకు పూనుకున్నా కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తూ వస్తున్నది. విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు, కూలీల వేతనాలు, డీజిల్, విద్యుత్తు, సాగునీరు మొదలైన ఉత్పత్తి ధరలు ఆకాశానికి అంటుతున్నా వీటిని పరిగణలోకి తీసుకోకుండా యంఎస్పి ఎ2+ఎఫ్ఎల్ ప్రకారం నిర్ణయించారు. ఇది సాధారణంగా సి2 కంటే సుమారు 30% తక్కువ. అయినా ప్రభుత్వం తనను తాను సమర్ధించుకోవడం సిగ్గుచేటు. రైతులకు లాభదాయక ధరలు ఇస్తున్నట్టుగా వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్ వాదిస్తోంది. ఉత్పత్తి ఖర్చులు సంవత్సరానికి సంవత్సరం పెరిగిపోతున్నాయి. దానితో ప్రభుత్వం ప్రకటించే (ఎంఎస్పికి) రైతులు పెట్టిన పెట్టుబడులకు ఏమాత్రం పొసగడం లేదు. తీరా పండించిన పంటను మార్కెట్లకు తీసుకెళ్తే ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరలకే మధ్య దళారీలకు రైతులు బలవంతాన అమ్ముకోవాల్సి వస్తున్నది. ప్రభుత్వం వరి మొక్క జొన్న పత్తి కంది లాంటి పంటలకు ఏ సీజన్లో కూడా కొనుగోలు కేంద్రాలను సకాలంలో తెరిచింది లేదు. రైతులు యంఎస్పి కంటే తక్కువ ధరకు కమిషన్ ఏజెంట్లకు అమ్ముకొని నష్టపోతున్నా పట్టించుకున్న పాపాన పోలే. రైతులు ప్రతి సీజన్లో ఆందోళనకు దిగితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నాయి. ఇది వాస్తవం కాదా? ఇప్పటికైనా రైతు సమస్యలు పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా, ఐక్య రైతు సంఘం నేతలు లింగాల వీరభద్రం, జాటోత్ నారసింహ, పైదా వెంకటేశ్వర్లు, తాటి నరసింహారావు, తెలం కృష్ణయ్య, మలకం సతీష్, బానోతు లాలు, భూత్యా శకురు, బాధాత్ బోజ్జా, కోటియా, పి పద్మావతి, నాగ విజయలక్ష్మి, రామనాథం, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ పాయంకు వినతి



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం గ్రామ పంచాయితీ పరిధిలో రహదారి భద్రతా పనులు పూర్తి చేసి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లుకు మణుగూరులోని ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. అశ్వాపురం ప్రధాన రహదారిపై డివైడర్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో పాటు రాత్రి వేళల్లో లైటింగ్ లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హెవీ వాటలర్ ప్లాంట్ జంక్షన్ నుంచి చింతిర్యాల క్రాస్ రోడ్డు వరకు రహదారి విస్తరణ, డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. భద్రాచలం కాగిత కర్మాగారం, భారజల కర్మాగారం, సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్, మణుగూరు బొగ్గుగనులు, భద్రాద్రి పవర్ ప్లాంట్‌లకు అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో భారీ వాహనాలు రద్దీ పెరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ఇటీవల ఆర్ అండ్‌బి కార్యాలయం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన విషయాన్ని ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రీ ప్రైమరీ టీచర్లు, ఆయాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని జగ్గారం ప్రాథమికోన్నత పాఠశాల, బంజర నెల్లిపాక(సవ్వళ్లగూడెం)ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ టీచర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వి వీరస్వామి తెలిపారు. ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టుకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టుకు 7వ తరగతి అర్హత ఉండాలని, అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఆధార్, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలు, రెండు ఫోటోలు, విద్యార్హతల ధ్రువపత్రాలతో పాటు గెజిటెడ్ అధికారిచే ధృవీకరించిన జిరాక్స్ ప్రతులను జత చేసి జూన్ 8 సాయంత్రం 5గంటల లోపు మండల విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

## గిద్దవారిగూడెంలో ప్రజాపాలన గ్రామసభ



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలం గిద్దవారిగూడెం గ్రామ పంచాయితీలో నిర్వహించిన ప్రజాపాలన 99 రోజుల ప్రణాళిక గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి చందన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు, తెల్ల రేషన్ కార్డులకు సన్న బియ్యం వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మిషన్ భగీరథ తాగునీటిని వినియోగించాలని కోరారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వరప్రసాద్, సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి అశోక్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్, ఇరిగేషన్ ఏఈ, వ్యవసాయ విస్తరన అధికారులు, సివిల్ సప్లై ఆర్ఐ వీరయ్య, డీలర్ల సంఘం అధ్యక్షుడు బద్రునాయక్, గ్రామ పంచాయితీ అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని కోరుతూ అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్)సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐయూకేఎస్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి గుగులోత్ తేజా నాయక్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను పూర్తి సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐయూకేఎస్ ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు పుల్లకాని సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు వడ్డే వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యుడు బాలునాయక్, నాయకులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ



ప్రజాపక్షం/దమ్మపేట: యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపచ్చే లక్ష్యంతో టీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల యువతీ యువకులు అందుబాటులో ఉంచిన క్యూఆర్ కోడ్(స్కాన్)ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలకు దోహపపడే నైపుణ్యాలను ఈ శిక్షణలో అందించనున్నందున యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ జారే ఆదినారాయణ కోరారు.

# నీట్ పరీక్షకు ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

**-పాఠశాలల పునః ప్రారంభం లోపు**
**యూనిఫామ్స్ సిద్ధం చేయాలి : కలెక్టర్ దివాకర టిఏస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టి అన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నీట్ పరీక్ష నిర్వహణ ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభంకు యూనిఫామ్స్ తయారీ, వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ తొమ్మిదిన జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టిసి బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం, ధాన్యం కొనుగోలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థులకు త్రాగునీరు, బెంచీలు, కుర్చీలు, మూత్ర శాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన రూట్‌లో మాత్రమే పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. ఎక్కడ కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జూన్ తొమ్మిదిన హైదరాబాద్ పరేడ్ మైదానంలో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టిసి బస్సుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకుని సాయంత్రం నాలుగు గంటల లోపు హైదరాబాద్ పరేడ్ మైదానంకు చేరుకునేలా చూడాలన్నారు. మహిళలకు మార్గ మధ్యలో భోజనాలు, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించేవిధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈవో చైతన్య జైని, డిఎంఅండ్‌హెచ్‌వో రామారావు, ఆర్టిసి డిఎం శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం

**కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు**





**ప్రజాపక్షం/వైరాః** ప్రజల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిందని వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు అన్నారు. శనివారం 20వ వార్డులో ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ప్రజల నుంచి స్పందన భారీగా లభించింది. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని సమస్యలపై వినుతలను అందజేశారు. ఈ గ్రామసభలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రేస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని విద్య, వైద్యం సంక్షేమ పథకాలను ప్రభుత్వం అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుందన్నారు. రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత వంటి విషయాల మీద ప్రజలకు మురళీకృష్ణ వివరించారు. గ్రామసభ వద్ద కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ సిబ్బంది ద్వారా ఉచి త హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 150 మంది వరకు షుగర్, బిపి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సూపర్‌వైజర్ సుధీర్, నాయకులు పువ్వాళ్ళ రాము, నాగమణి, పృధ్వి, లక్ష్మి బాయి, విజయ్, రాము, దుర్గయ్య, నాగేశ్వరరావు, బీక్యా, పందు, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో.. వైరా మున్సిపాలిటీకా.. నేను రాను..!

**-భయపడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు**
**- ఖాళీగా ఉన్న కీలకమైన శాఖలు**






**ప్రజాపక్షం/వైరాః** రాను రాను...నేను రాను...వైరా మున్సిపాలిటీకి అంటున్న పలువురు ప్రభుత్వ ఉద్యోగులు. వైరా మున్సిపాలిటీలో కీలకమైన ప్రభుత్వ అధికారుల శాఖలు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ పనిచేసిన కొందరు ఉద్యోగులు కూడా ఇటీవల జరిగిన బదిలీల్లో కొందరు ఉద్యోగులు కూడా ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం వైరా మున్సిపాలిటీకి రావడానికి అధికారులు ఇష్టపడం లేదు అని తెలుస్తుంది. ఇప్పటికే మున్సిపాలిటీలోని కీలకమైన రెవెన్యూ, మున్సిపాలిటీ మేనేజర్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాలు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీ స్థానాల్లో భర్తీ చేయడానికి ఇఈవల జరిగిన బదిలీల్లో వైరాకి ఎవరు పెట్టుకోలేదు. మున్సిపాలిటీలో ముగ్గురు వార్డు అధికారులు ఉండగా, మిగతా 17 మంది వార్డు అధికారులు లేక ఖాళీగా ఉన్నాయి. అధికారులు ఇక్కడికి రావడానికి ఇష్టపడడం లేదని తెలుస్తుంది. కీలకమైన శాఖల్లో ఇప్పటివరకు వచ్చిన అధికారులు ఎవరూ కూడా ఎక్కువ రోజులు ఎక్కవడ విధులు నిర్వహించకుండానే వెళ్లిపోయారు. ఏది ఏమైనా వైరా మున్సిపాలిటీలో అధికారులు పనిచేయడానికి వెనుకడుగు వేస్తున్నారు అని చెప్పవచ్చును. మున్సిపాలిటీలో ఆదాయాన్ని పెంచే శాఖలో పట్టున్న అధికారులు వస్తేనే వైరా మున్సిపాలిటీ ఆదాయం పెరుగుతుంది. అభివృద్ధి వైపు వెళుతుంది. పరిపాలన విభాగంలో అధికారులు కర్తవ్యం ఎంతో గొప్పది, అలాంటి కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహించి మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడే మంచి అధికారులు వైరా మున్సిపాలిటీ వస్తే పరిపాలన కూడా సౌలభ్యం అవుతుంది. నూతన కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.రామచంద్రరావు మున్సిపాలిటీ అధికారుల కొరతను ఏ విధంగా భర్తీ చేస్తారో పాలన విభాగం పట్టు తప్పకుండా ఎలాంటి ప్రయతానలు చేస్తారో, జిల్లా కలెక్టర్తో మాట్లాడి నూతన అధికారులను తెప్పిస్తారో వేచిచూడాల్సిందే.

# ప్రైమరీ పోస్టులు, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని ఆరు పాఠశాలల్లో ప్రైమరీ పోస్టులకు ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ నివేదిత ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఎస్ కల్లూరు, కొత్త బోడిమెల్ల, అంబేద్కర్ నగర్, మర్లపాడు, చిన్న కోరుకొండి ఆయా పాఠశాలలకు ప్రైమరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్థానికులై ఉండి పదో తరగతి పాస్ అయి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తులను చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలను కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# ప్రజా పాలన గ్రామ సభలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మం డల పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. శనివారం ఈర్లపుడి, కొర్లబోడుతండా, లచ్చిరాంతండా, దొనబండ, హర్యాతండా, బద్యాతండా, రాంక్యాతండా, పుఠానితండా, బూడిదంపాడు, సూర్యాతండా తదితర గ్రామా ల్లో గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో వర్షాకాల సన్నద్ధత, సురక్షిత త్రాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ మన సంరక్షణ, ఓటర్ల జాబితా ప్రత్యేక కార్యక్రమం, వరదల నిర్వహణ భద్రత తదితర అంశాలపై గ్రామాల్లో చెత్త నిర్వహణ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. హర్యాతండాలో నిర్వహించిన సభలో ఎంపిడివో అశోక్‌కుమార్, లచ్చిరాంతండాలో జరిగిన సభలో ఎంపివో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. బూడిదంపాడులో నిర్వహించిన గ్రామసభలో తెలంగాణ సాంస్కృతిక కళా బృందాల ఆధ్వర్యంలో గృహ వ్యర్థాలు, పంట వ్యర్థాలు కాల్చడంపై, వన మహోత్సవంపై పాటలు పాడి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంతానోత్పత్తి క్యాంపు ప్రారంభం



**ప్రజాపక్షం/వైరాః** వైరాలో మురళీకృష్ణ హాస్పిటల్ నందు శనివారం అంకుర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతానోత్పత్తి(ఇన్ఫెర్టిలి టీ) ప్రత్యేక వైద్యశిబిరాన్ని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడం అత్యంత అవసరమని తెలిపారు. ఇటువంటి ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని పేర్కొ ని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ(ఎండి,గైనకాలజీ అండ్ అబ్స్టెట్రిక్స్), డాక్టర్ కల్పన(ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్) పాల్గొని ఐవిఎఫ్ చికిత్సలు, సంతానలేమికి అందుబాటుఉలో ఉన్న ఆధునిక వైద్య విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ కాపా మురళీకృష్ణ, శీలం నర్సిరెడ్డి, ఎస్సై పువ్వాల రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, గుమ్మారోశయ్య, పొదిల హరినాథ్, తోటకూర శ్రీకాంత్, పువ్వాళ్ళ రాము, జాలా పుల్లారావు, ఆసుపత్రి వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు, పలువురు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు



**ప్రజాపక్షం/వైరాః** వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఐఏఎస్ జారీ చేసిన ప్రశంసా పత్రాన్ని వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఫిషరీస్ కాలనీ ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు, ఉపాధ్యాయులు బీరెల్లి రామకృష్ణ, గత విద్యా సంవత్సరం 90 శాతానికి పైగా పాఠశాలకు హాజరైన ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రశంసా పత్రం అందించడం జరిగింది. ఫిరషరీస్ కాలనీ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

# జాతీయ స్థాయి ఉపకార వేతనానికి ఎంపిక



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని పీఎం శ్రీ పాఠశాలకు చెందిన విద్యార్థి నేషనల్ నేమ్స్ కం మెరిట్ స్కాలర్షిప్ జాతీయస్థాయి పోటీ పరీక్ష జరిగింది. ఈ పోటీలలో పాలపాటి దిలీప్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎంఈఓ నివేదిత ఉపాధ్యాయ సిబ్బంది బోధనేతర సిబ్బంది తోటి విద్యార్థులు ఆ విద్యార్థిని అభినందించారు.

# తాటిపూడి - ముసలిమడుగు రోడ్డుకు రూ.4.50కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం తాటిపూడి నుంచి ముసలిమడుగు వరకు రూ.4.50 కోట్లు అంచనా వ్యయంతో నూతన బిటి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి(రోడ్డు) శాఖ జీవో నెంబర్ 317 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జీవోకు సంబంధించి వివరాలను ఖమ్మ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ముసలిమడుగు సర్పంచ్ తడికమళ్ళ నాగార్జున్, స్నానాల లక్ష్మీ పురం సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షుడు సత్తెనపల్లి నర్సింహారావు, గ్రామ కాంగ్రేస్ నాయకులు దుంపటి నాగేశ్వరరావు, చింతనిప్పు శ్రీనివాసరావు, కేతవరపు వెంకటేశ్వర్లు, కొరివి కాటమరాజు, చింతనిప్పు బాబురావు, లతీఫ్, జాని తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- అటవీ అధికారుల దాడులు ఆపి పోడు సాగుకు వీలు కల్పించాలి
- రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలి
-10న జరగనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇసుక కొరత నివారించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శనివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ పాల్వంచ మండల విస్తృత కౌన్సిల్ సమావేశానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత వల్ల అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సమస్య ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం స్థానిక ప్రజల అవసరాలకు ఇసుకను సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున అటవీ అధికారులు జిల్లా వ్యాప్తంగా పోడు సాగుదారులపై దాడులు చేసి ఇబ్బందులకు గురిచేయరాదని, పోడు భూముల సాగు చేసుకునే విధంగా వీలు కల్పించాలన్నారు. అటవీ అధికారులు కవ్వింపు చర్యలకు పాలుపడితే ప్రతిఘటన తప్పదని తెలిపారు. రైతులు పండించిన పంటలను షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా కాడాలు, గన్నీ బ్యాగులు, హామలీలు,లారీలను ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం గ్రామాల్లో ప్రజలతో మమేకవుతూ ప్రజులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన తెచ్చుకుని వాటి పరిష్కారానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, తద్వారా పార్టీ మరింత బలోపేతం అవడానికి దోహదపడుతుందన్నారు. పాలకులు నిర్లక్ష్య వైఖరి అనాలోచిత చర్యల వల్ల నిత్యవసరాలు ధరలు నానాటికీ పెరిగిపోతున్నాయని, ఈ ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, నష్ట నివారణ చర్యలు చేపట్టి సామాన్య ప్రజలతు నిత్యవసరాలు అందుబాటులో ఉండేలా నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ధరల పై ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వేలాదిమంది ప్రజలతో ధర్నా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ ధర్నా విజయవంతానికి ప్రతీ గ్రామం నుండి పెద్ద ఎత్తున కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీశంశెట్టి పద్మ, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, సర్పంచ్‌లు పోడే వెంకటరమణ, సరస్వతి, భూక్యా ఝాన్సీ, పొందెం నిషారాణి, తేజావత్ వినోద్, మాలోత్ హరి, బానోత్ విజయ్ కుమార్, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీనివాసరావు, కొంగర అప్పారావు, నిట్ట అమృతరావు, విజ్జా వాసు, చిల్లా కృష్ణ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# మితిమీరి పెరుగుతున్న నిత్యావసరాల ధరలు

- నియంత్రణలో పాలకులు విఫలం
- 10న కలెక్టర్ ధర్నాను జయప్రదం చేయండి
- కంచర్ల జమలయ్య



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నానాటికీ సామాన్యునికి అందనంతగా నిత్యవసరాల ధరలు మితిమీరి పోతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణలో విఫలమయ్యాయని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని ప్రశాంత్ నగర్ గ్రామపంచాయితీలో శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ధరల నియంత్రణ కోసం ఈనెల 10వ తేదిన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టామని, దానిని విజయంవంతం చేసేందుకు అంతా కృషి చేయాలన్నారు. ప్రజాపక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున మద్దతివ్వాలన్నారు. అనంతరం జూన్ 10న తలపెట్టిన మహా ధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ వాడే రాములు, వార్డు సభ్యులు, ఇఫిఐ నాయకులు మర్రి గోపి, మండల రాజేశ్వరరావు, విరిగినేని రాజేందర్, మట్టి కొండయ్య, సమ్మక్క, జయంత్, ధారా లక్ష్మి , రోజా, కమల తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా మాజీ ఎంఎల్‌ఏ కందాళ

-కూసుమంచి మండలంలో బాధిత కుటుంబాల పరామర్శ
-అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి ఆరోగ్య వివరాలపై ఆరా
-ధైర్యంగా ఉండాలని కుటుంబాలకు భరోసా







**ప్రజాపక్షం/కూసుమంచి:** పాలేరు మాజీ ఎంఎల్‌ఏ కందాళ ఉపేందర్ రెడ్డి కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన లోడిగా రాములమ్మ, గాంతి లచ్చిరెడ్డి, అలాగే చౌటుపల్లి, చేగొమ్మ గ్రామాలకు చెందిన సట్టు కోటమ్మ, మరికంటి వెంకటనారాయణ కుటుంబాలను వారి నివాసాల్లో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకుని ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం కూసుమంచి గ్రామానికి చెందిన కొక్కిరేణి వీరస్వామి, మందనాగుల అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అవసరమైతే మెరుగైన వైద్యం సేవలు పొందాలని సూచించారు. ఈసందర్భంగా కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో కూసుమంచి మండల మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీ ప్రైమరీ విద్య కేంద్రాల్లో నియామకాలకు దరఖాస్తు చేసుకోండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని ఫ్రీ ప్రైమరీ విద్యా కేంద్రాలలో పని చేయటకు టీచర్లు, ఆయాల కోరకు అర్హత కలిగిన వారు దరఖాస్తు లు చేసుకోవాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు కోరారు. మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం లోని బైరవునిపల్లి, రాయగూడెం, చెరువుమాధారం, పైనంపల్లి, సింగారెడ్డిపాలెం (ఎన్‌ఎస్‌ఈపీ), నాచేపల్లి ప్రాథమికొన్నత పాఠశాలలను+ పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా మంజూరు చేశారు. ఈ పాఠశాలలో టీచర్ల గా, ఆయా లుగా పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 8 వ తేది నుంచి 9 వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ధరఖాస్తులు అందించాలని సూచించారు. టీచర్ కు రూ.8 వేలు, ఆయా లకు రూ.6 వేలు గౌరవ వేతనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావునా అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించాలి

### పెసర విత్తనాలు పంపిణీ చేసిన సొసైటీ చైర్మన్ రమణయ్య



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతులు పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధించాలని నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ తీగ రమణయ్య సూచించారు. నేలకొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మంజూరైన 10 క్వింటాల పెసర విత్తనాలను శనివారం చైర్మన్ రమణయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజన్ కు అనుకూలమైన పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. సోసైటీ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు అందించినట్లు పేర్కొన్నారు. కిలో రూ.136 చొప్పున, 4 కిలోల పెసర విత్తనాల సంచి రూ.544 లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సోసైటీ పరిధిలోని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించనున్నట్లు తెలిపారు. సోసైటీ ని జిల్లాలోనే ఆదర్శంగా ఉండేలా పాలకవర్గం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రైతులు విత్తనాలు ను పొంది. పంటలో మేలు దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోసైటీ సీఈవో ఖమ్మం వెంకటేశ్వర్లు, కనపర్తి నాగేందర్, డైరెక్టర్ నున్నా అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నామా వినోద్‌పై దాడిచేసిన భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కొత్తగూడెం కార్పొరేషన్ సిపిఐ పక్ష మహిళా ప్రతినిధి పద్మ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నామా వినోద్‌పై దాడి చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నాలను అడుడుకొవడంతోనే కక్ష కట్టి దాడికి పాల్పడ్డారని కొత్తగూడెం కార్పొరేషన్ సిపిఐ పక్ష మహిళా ప్రతినిధి పద్మ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శేషగిరి భవన్‌లో ఆమె మాట్లాడుతూ పాల్వంచ సీతారామపట్నం 35వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని ప్రజలు ఉపయోగార్థం ప్రీ ప్రైమరీ హెల్త్ సెంటర్, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ హాల్ నిర్మాణం కోసం కేటాయించాలని ప్రజల తరుపున తాము అధికారులను కోరామని ఆమె తెలిపారు. ప్రజా అవసరాల నిమిత్తం స్థానిక తహశిల్దార్ ఆ భూమిని అధికారికంగా సర్వేకూడా చేశారని అమె గుర్తు చేశారు. అయితే ఈ విషయాన్ని జీర్ణించుకోలేక ఆ భూమిని కబ్జా జేయాలని దురుద్దేశ్యంతో 35డివిజన్ కార్పొరేటర్ భర్త నామ వినోద్ పై కొందరు భూ కబ్జాదారులు అత్యంత అమానుషంగా దాడి చేశారని ఆమె మండిపడ్డారు. సమాజంలో ఇలాంటి అరాచక శక్తుల ఆగడాలను ప్రజలంతా ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దాడి ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు అత్యంత కఠినంగా వ్యవహరించి నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నామా కీర్తి, పగడాల అకాంక్ష, నూనావత్ శ్యామల, మద్దాల హరిత, యూసుఫ్, బండి నర్సింహా, బోయిన విజయ్ కుమార్, పోలమూరి ధనలక్ష్మి , గుర్రం వెంకటేశ్వరరావు, సింధు తపస్వి తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

-కూసుమంచి మండలంలోని 7 పాఠశాలల్లో ఖాళీలు




**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలోని 7 ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రాయల వీరస్వామి తెలిపారు. యూపీఎస్ చౌటపల్లి, నాయకన్‌గూడెం, పీఎస్ పాలేరు, కూసుమంచి, కూసుమంచి ఎస్సీ కాలనీ, చేగొమ్మ, జీళ్ల చెర్వు పాఠశాలల్లో పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్, ఆయా పోస్టుకు 7వ తరగతి అర్హత ఉండాలని, అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎంపికైన వారికి ఇన్‌స్ట్రక్టర్‌కు రూ 8వేలు, ఆయాకు రూ 6వేల గౌరవ వేతనం అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 8,9 తేదీల్లో మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# భద్రాచలంలో ఇసుక లొల్లి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇసుక ర్యాంపు కేటాయింపులో లక్షలు చేతులు మారిన ఘటనకు సంబంధించి కొందరు వ్యక్తులు ఆందోళనకు దిగడంతో భద్రాచలంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భద్రాచలం పరివాహక ప్రాంతంలో ఇసుక ర్యాంపులు అక్రమార్కులకు, కొందరు ప్రజాప్రతినిధులకు ఆదాయ వనరులుగా మారాయి. ప్రజాప్రతినిధులు తమకు అనుకూలురైన వారికి ఇసుక ర్యాంపులు ఇప్పించడం తద్వారా పరోక్ష పద్దతిలో ఆదాయాన్ని పొందడం గత కొంత కాలంగా జరుగుతుంది. ఈ క్రమంలోనే ప్రజా ప్రతినిధులకు సన్నిహితంగా ఉండే కొందరు ఇసుక ర్యాంపులపై బేరసారాలకు దిగడం, ఇసుక ర్యాంపులు కేటాయించేవిధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చి డబ్బులు తీసుకోవడం ఆనవాయితీగా మారింది. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రజాప్రతినిధులందరికీ ఇది వారసత్వంగా వస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే భద్రాచలం పట్టణానికి సంబంధించిన అధికార పార్టీ నేత ఒకరు ఇసుక ర్యాంపు ఇప్పిస్తానని రూ. 90 లక్షలు తీసుకున్నారంటూ బాధితురాలు ఆమె అనుచరులు ఆయన ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. నవాబ్ అనే వ్యక్తి తమ వద్ద నుంచి రూ. 90 లక్షలు తీసుకుని మంత్రికి, స్థానిక శాసన సభ్యునికి చెప్పి ఇసుక ర్యాంపు కేటాయించేలా చూస్తానని చెప్పారని బాధితులు ఆరోపించారు. ఈ విషయమై స్థానిక శాసన



సభ్యులు తెల్లం వెంకట్రావుకు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించ లేదన్నారు. దీనితో బాధితులు ఆందోళనకు దిగారు. ఈ సమయంలో భద్రాచలంలో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఆరోపణలు, ఖండనలు, కేటాయింపుల వెనక ఉన్న నిజాలపై పూర్తి విచారణ జరపాలని, ఇసుక అక్రమ వ్యాపారంపై ప్రభుత్వం దృష్టిసారించి నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజాసమస్యలు గ్రామసభల ద్వారా పరిష్కారం

**ప్రజాపక్షం/తల్లాడ :** ప్రజాసమస్యలకు గ్రామసభలద్వారానే పరిష్కారం లభిస్తుందని ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి గ్రామసభను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తల్లాడ ఎంపిడీఓ శ్రీధర్‌రాజు అన్నారు. మండల పరిదిలోని గొల్లగూడెం



పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రామసభలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా విడతల వారీగా నిర్వహిస్తున్న గ్రామసభలు ప్రజాపాలనకు అద్దం పడుతుందని అన్నారు. త్రాగునీటి సరఫరా, వర్షాకాలసన్నద్దత, మొక్కల పెంపకం, వనసంరక్షణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరదలు విపత్తుల నిర్వహన వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలను వెంటనే సబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు పరిపాలనా అనుమతులు సాధించేందుకు కృషిచేస్తామమని హామీనిచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కోడూరు ఉమాదేవి, ఉపసర్పంచ్ నాగలక్ష్మి, ఆర్ఐ డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఈఓ, బిసీ సెల్ అధ్యక్షులు కోడూరు వీరకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కవిత, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# 7, 8 తేదీల్లో ఏఐటియుసి సెంట్రల్ కౌన్సిల్ సమావేశం

**-ఆరు జిల్లాల నుంచి 151 మంది ప్రతినిధుల హజరు**
**కార్మిక సమస్యలు, సింగరేణి భవిష్యత్తుపై సుదీర్ఘ చర్చలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) సెంట్రల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 7, 8 తేదీలలో కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్ తెలిపారు. ఈ సమావేశాలకు సింగరేణి పరిధిలోని ఆరు జిల్లాల నుంచి సుమారు 151 మంది యూనియన్ ప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో సింగరేణి సంస్థ ప్రస్తుత



పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, యాజమాన్యం,ప్రభుత్వాల విధానాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరగనున్నాయని ఆయన వెల్లడించారు. సంస్థ మనుగడ, అభివృద్ధి కోసం కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు, బొగ్గు ఉత్పత్తి పెంపు, సంస్థ ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన పోరాటాలపై కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. అలాగే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి రెండు నెలలకు ఒకసారి డైరెక్టర్ స్థాయి, ప్రతి మూడు నెలలకు ఒకసారి సీఎండీ స్థాయి నిర్మాణాత్మక సమావేశాలు గుర్తింపు సంఘం తో నిర్వహించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న 11వ క్యాడర్ స్కీమ్ అమలు, వారసత్వ ఉద్యోగాల పునరుద్ధరణ, ప్రతి నెలా మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణ, మారుపేర్ల సమస్య పరిష్కారం, పర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపు పన్ను భారం తొలగింపు, ప్రతి కార్మికునికి 200 గజాల ఇంటి స్థలం కేటాయింపు, రూ.30 లక్షల వడ్డీలేని గృహ రుణం మంజూరు వంటి అంశాలు కూడా ప్రధానంగా చర్చకు రానున్నాయి. అదే విధంగా సింగరేణి వ్యాప్తంగా మైన్స్, డిపార్ట్‌మెంట్లలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, జెన్‌కో నుంచి రావాల్సిన రూ.53 వేల కోట్ల బకాయిలను తక్షణమే వసూలు చేయాలని సమావేశం డిమాండ్ చేయనుంది. కార్మిక వ్యతిరేక విధానాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలపై భవిష్యత్ పోరాటాలు, ఉద్యమాల రూపకల్పనపై రెండు రోజులపాటు సుదీర్ఘ చర్చలు జరుగుతాయని సముద్రాల సుధాకర్ తెలిపారు.

**కొమరయ్య విగ్రహావిష్కరణకు భారీగా తరలిరావాలి...**

ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట పునఃప్రారంభించే మనుబోతుల కొమరయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నుండి యూనియన్ నాయకులు, కార్మికులు, అభిమానులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్ పిలుపునిచ్చారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/కల్లూరు:** ఇటీవల దొంగతనాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హరిత కోరారు. ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు మరియు రాత్రి తలుపులు కిటికీలు సక్రమంగా తాళం వేసి ఉన్నాయా లేదా నిర్ధారించుకోవాలని అధిక మొత్తంలో నగదు, బంగారం, విలువైన వస్తువులు ఇంటిలో దాచుకోవద్దని, లాకర్లో మాత్రమే ఉంచుకోవాలని ఇంటి పరిసరాల్లో తగిన వెలుతురు ఉండేలా చూడాలని, బలమైన తాళాలు, సెక్యూరిటీ డోర్లు భద్రత ఏర్పాటు చేసుకొని ఉంచుకోవాలని అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిచాలని ఇండ్లు వ్యాపార సంస్థలు మరియు ఇతర ముఖ్య ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బయటకు వెళ్లేటప్పుడు పొడుగు వారికి సమాచారం అందివ్వాలని ఆస్తి నేరాల నివారణ మరియు గుర్తింపును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాత్రి వేళల్లో గ్రామాల్లో కాలనీలలో ప్రత్యేక పెట్రోలింగ్ మొబైల్ టీం ఏర్పాటు చేసినట్లు ప్రజల సహకారంతో నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై హరిత విలేకరులకు తెలిపారు.

# పదిహేనేళ్లుగా ఎదురుచూపు..!

**-ఇల్లందు, డోర్నకల్ వయా కారేపల్లి బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి**
**-ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ చొరవ కోరుతున్న ప్రజలు**

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఇల్లందు, డోర్నకల్, వయా కారేపల్లి మార్గంలో గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను తిరిగి ప్రారంభించాలని ఇల్లందు, కారేపల్లి, వైరా మండలాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు 15ఏళ్లుగా ఈ సర్వీస్ నిలిచిపోవడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తు




న్నారు. ఈ మార్గంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, వృద్ధులు డోర్నకల్, ఖమ్మం వంటి ప్రధాన కేంద్రాలకు చేరుకోవడానికి పలు మార్లు బస్సులు మారాల్సి వస్తోంది. ముఖ్యంగా డోర్నకల్ రైల్వే జంక్షన్‌కు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, వైద్య సేవలు, ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం ప్రయాణించే ప్రజలకు ప్రత్యక్ష బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల అదనపు ఖర్చు, సమయ నష్టం జరుగుతోందని పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో అయితే ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ బస్సు సర్వీస్ పునరుద్ధరణతో ఇల్లందు, కారేపల్లి, వైరా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభించడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మరింత చేరువవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుతున్నారు. ముఖ్యంగా వైరా ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ చొరవ తీసుకుని ప్రభుత్వం, రవాణా శాఖ అధికారులతో చర్చించి ఇల్లందు, డోర్నకల్, వయా కారేపల్లి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మధిర సమాచారం...

## సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్

ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోరారు. శనివారం మధిర నియోజకవర్గంలో కలెక్టర్ పర్యటించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. జాలిముడి గ్రామంలో జేసి ఈ. శ్రీనివాసరెడ్డి తో కలిసి ఇంటింటికి తిరిగి కలెక్టర్ ఓటర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్బంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలను మాత్రమే తొలగించడం జరుగుతుందన్నారు. బిఎల్‌వోలకు సర్ నిబంధనలు, విధి విధానాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో శ్రీనివాస్, తహసీల్దార్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

లారీ ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందగా చిన్నారి సహా నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణాజిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఓ కుటుంబం దైవ దర్శనం కోసం జమలాపురం వెళ్లి తిరిగి వస్తుండగా దెందుకూరు వద్ద ఆటోను లారీ ఢీకొనడంతో తాళ్లూరి భవాని (40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఉన్న మూడేళ్ల బాలికతో పాటు తాళ్లూరి చంద్ర,





మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భవాని తీవ్రంగా గాయపడగా మధిరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. మధిర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ నాయకుడు యడ్లపల్లి మృతి

మండల పరిధిలోని దెందుకూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు యడ్లపల్లి నాగయ్య మృతిచెందాడు. కాంగ్రెస్ నాయకులు నాగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## అంబర్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధిర మండలంలోని అంబర్‌పేట వైకుంఠ ధామం నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ సామినేని సుజాత శంకుస్థాపన చేశారు. మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక కృషితో మధిర నియోజక వర్గం, మధిర మున్సిపాలిటీ త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు కౌన్సిలర్ రాజు, కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పి. వెంకటేశ్వర్లు, పారుపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.